TGTEL/26/A6780

# స్పందన
తెలుగు దినపత్రిక

సంపుటి :01 | సంచిక :28 | పేజీలు 8 | వెల : 5

గురువారం 15 అక్టోబర్ 2026

విలేకరులు కావలెను

జర్నలిస్టులే యాజమాన్యంగా నడపబడుతూ
ప్రజా గొంతుకై అనతికాలంలోనే ప్రభంజనం సృష్టిస్తున్న
స్పందన దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను.
అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.ఆసక్తి ఉన్న వార
ఈ క్రింది నెంబర్లలలో సంప్రదించండి
9440657806,9440697806


2లో


2లో

# విద్యుత్తు అంతరాయాలపై సీఎం ఆగ్రహం

**రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, జిల్లాలవారీగా ప్రస్తుత పరిస్థితిని ముఖ్యమంత్రికి వివరించిన ఉన్నతాధికారులు**

- ఎన్నిసార్లు చెప్పినా మీరు మారరా!
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే స్పెషల్ సీఎస్, జెన్‌కో సీఎండీలను సస్పెండ్ చేస్తా
- పంటలు ఎండిపోకుండా రేయింబవళ్లు కరెంటు సరఫరా చేయాలి
- తాగునీరు, పశుగ్రాసానికి కొరత రావద్దు
- ఎల్‌నినో.. కొవిడ్ లాంటి విపత్తు.. వచ్చే జూన్ వరకు కార్యాచరణ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

"ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై శాఖలు అప్రమత్తం కావాలి. ఈ పరిస్థితి ఎప్పటివరకు ఉంటుందో ఎవరికీ తెలియదు. ఇప్పుడు సమస్యగా కనిపిస్తోంది. మున్ముందు సంక్షోభంగా మారుతుంది. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో ఎల్‌నినో ప్రభావాన్ని లోతుగా అంచనా వేయాలి. సమస్యలను అధిగమించేందుకు పరిష్కార మార్గాలను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలి. మళ్లీ వానలు వచ్చే వరకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టాలి. తాగునీరు, పశుగ్రాసానికి ఇబ్బందులు రాకుండా చర్యలుతీసుకోవాలి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిర్మాణ రంగంతో పాటు ఇతర అవసరాలకు మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా చర్యలు చేపట్టాలి"

# సింగరేణి ప్రైవేటీకరణకు కాంగ్రెస్ యత్నం

**సైట్ విజిట్ సర్టిఫికేషన్ పేరిట రూ.10 వేల కోట్ల కుంభకోణం**

**సింగరేణి కార్మిక గర్జన సభలో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్**

'నైనీ బొగ్గు టెండర్ల కుంభకోణాన్ని అడ్డుకున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. తద్వారా ప్రభుత్వానికి రూ.30 వేల కోట్లు మిగిలాయని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఆ మొత్తాన్ని కాజేయాలనుకున్నది ఎవరు? అసలు విషయం బయటకు రావాలి. వాటాలు కుదరకనే నైనీ బ్లాక్ టెండర్లు రద్దయ్యాయి. సింగరేణిలో సైట్ విజిట్ సర్టిఫికేషన్ పేరిట సుమారు రూ.10 వేల కోట్ల కుంభకోణం జరిగింది. దీనిపై ఆధారాలతో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తే ఈ వ్యవహారంపై విచారణ జరపకుండా ఆయన సీఎంకు లేఖ రాశారు. దీని ద్వారా కాంగ్రెస్, భాజపాల మధ్య చీకటి ఒప్పందం



# స్పర్శ్ హాస్పీస్ రాష్ట్రానికి గర్వకారణం: పొంగులేటి

రాయదుర్గం: జీవితంలో అత్యంత క్లిష్టమైన దశలో ఉన్న రోగులకు అండగా నిలుస్తున్న ఖాజాగూడ 'స్పర్శ్ హాస్పిస్' తెలంగాణకు గర్వకారణమని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. స్పర్శ్ హాస్పిస్ 15 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం స్థానికంగా ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. సంస్థకు ఎన్ఏబీహెచ్ (నేషనల్ అక్రెడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్‌కేర్ (ప్రొవైడర్స్) నుంచి ధ్రువీకరణ లభించిన సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన ఎన్ఏబీహెచ్ అక్రెడిటేషన్ శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. అనంతరం సంస్థ సేవలకు గుర్తింపుగా లభించిన గైడ్ స్టార్ ఇండియా ధ్రువపత్రాన్ని నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..స్పర్శ్ హాస్పిస్ వంటి సంస్థలకు ప్రభుత్వ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఏఐజీ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి ప్రసంగిస్తూ.. జీవిత చరమాంకంలో ఉన్న బాధితులకు స్పర్శ్ హాస్పిస్ అంకితభావంతో సేవలందిస్తున్న తీరు ఆదర్శనీయమని కొనియాడారు. స్పర్శ్ వ్యవస్థాపక ట్రస్టీ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. దేశంలో ఎన్ఏబీహెచ్ గుర్తింపు లభించిన తొలి పాలియేటివ్ కేర్ సెంటర్ స్పర్శ్ హాస్పిస్ అని తెలిపారు.



# ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల..

**తొలి దశ నవంబర్ 26న పోలింగ్**

**మూడో దశ డిసెంబర్ 2న ఎన్నికలు**

**మున్సిపల్ ఎన్నికలు ఈ నెల 28న**

**మున్సిపల్ ఫలితాలు ఈ నెల 30న**

**ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నవంబర్ 3న**

ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేతా బుధవారం విజయవాడలో ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమల్లోకి వచ్చింది.తొలి విడతలో భాగంగా 100 పట్టణ స్థానిక సంస్థలకు (ఖాదీ) ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి 18 వరకు నామినేషన్లు స్వీకరించనుండగా, 19న పరిశీలన, 21న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అక్టోబర్ 28న పోలింగ్ నిర్వహించి, 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.రెండో విడతలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 3న పోలింగ్, 5న ఫలితాలు వెల్లడిస్తారు. ఇక మూడో విడతలో గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. నవంబర్ 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో పోలింగ్, లెక్కింపు ప్రక్రియ పూర్తి చేస్తారు.


2లో

# తెలంగాణలో పెట్టుబడులకు పూర్తి భరోసా

**రాబోయే రోజుల్లో తయారీరంగం విస్తరణపై దృష్టి**

**బ్రిటన్ ప్రతినిధుల బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి**

# పాత రోజులంటే పాలమూరు నుంచి వలసలేనా..?



ధరూరు, గట్టు: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పాత రోజులు తీసుకొస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. పాలమూరు ప్రజలను వలసలు పంపుతూ ఇచ్చిన మాటను అమలు చేస్తున్నారని మాజీ మంత్రి, భారాస సీనియర్ నేత హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. గద్వాల నియోజకవర్గం గట్టు మండలం ఇందువాసిలో వారం రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వలస కూలీలు మృతిచెందగా.. బాధిత కుటుంబాలను హరీశ్‌రావు బుధవారం పరామర్శించారు. పార్టీ తరఫున అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. పాలమూరు ప్రాజెక్టులను ఎండబెట్టి రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వం కారణమవుతోందన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో రైతులకు గ్రహణం పట్టిందని ఆరోపించారు. జూరాలకు రెండు వందల టీఎంసీలకుపైగా వరద వచ్చినా.. ఎత్తిపోయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. ఓ పక్క మన జలాశయాలు వెలవెలబోతుంటే ఏపీలో నిండుగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.

# సింగరేణి ప్రైవేటీకరణకు కాంగ్రెస్ యత్నం



కరీంనగర్ సింగరేణి ప్రైవేటీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం యత్నిస్తోందని, ఆ కుట్రలను సమర్థంగా తిప్పికొడతామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. సింగరేణిలో నైనీ బొగ్గు బ్లాక్ టెండర్లు, సైట్ విజిట్ సర్టిఫికేషన్, ఓపెన్ కాస్ట్ గనుల టెండర్లు, బొగ్గు ఉత్పత్తి, యంత్రాల కొనుగోళ్లలో భారీగా అవినీతి జరిగిందని ఆరోపించారు. అవకతవకలపై సీబీఐ లేదా సిటింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో తెలంగాణ బొగ్గు గనుల కార్మిక సంఘం, భారాస ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిర్వహించిన సింగరేణి కార్మిక గర్జన బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగిస్తూ ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. 'నైనీ బొగ్గు టెండర్ల కుంభకోణాన్ని అడ్డుకున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. తద్వారా ప్రభుత్వానికి రూ.30 వేల కోట్లు మిగిలాయని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఆ మొత్తాన్ని కాజేయాలనుకున్నది ఎవరు? అసలు విషయం బయటకు రావాలి. వాటాలు కుదరకనే నైనీ బ్లాక్ టెండర్లు రద్దయ్యాయి. సింగరేణిలో సైట్ విజిట్ సర్టిఫికేషన్ పేరిట సుమారు రూ.10 వేల కోట్ల కుంభకోణం జరిగింది. దీనిపై ఆధారాలతో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తే ఈ వ్యవహారంపై విచారణ జరపకుండా ఆయన సీఎంకు లేఖ రాశారు. దీని ద్వారా కాంగ్రెస్, భాజపాల మధ్య చీకటి ఒప్పందం ఉందని స్పష్టమవుతోంది. సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తి తగ్గడానికి టెండర్ల నిర్వహణలో ఆలస్యమే ప్రధాన కారణం. సైట్ విజిట్ సర్టిఫికేషన్ పేరుతో టెండర్లను ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారు. శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల్లో ఏడు సార్లు టెండర్లు వాయిదా వేయడం వెనుక సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన బావమరిది సృజన్‌రెడ్డిలది కీలక పాత్ర. 40 లక్షల టన్నుల బొగ్గు మాయం సింగరేణిలో 2023 డిసెంబరులో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి ఉంటే, గతేడాది 58 మిలియన్ టన్నులకు పడిపోయింది. టెండర్లలో జాప్యం, నిర్వహణ లోపాలు, నిర్ణయాలు తీసుకోవడంలో వైఫల్యమే ఇందుకు కారణం. సింగరేణివ్యాప్తంగా సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయమైంది. అది ఎక్కడికి వెళ్లిందో సమాధానం చెప్పాలి. యాదాద్రిలో నాలుగు వేల మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్తు కేంద్రాన్ని నిర్మిస్తే ప్రస్తుతం 400 మెగావాట్ల విద్యుత్తు కూడా ఉత్పత్తి కావడం లేదు. రాష్ట్రం ఏర్పడే సమయానికి విద్యుదుత్పత్తి సామర్థ్యం కేవలం 7,778 మెగావాట్లుగా ఉండేది. కేసీఆర్ పాలనలో దాన్ని 24 వేల మెగావాట్ల స్థాయికి తీసుకెళ్లాం. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తు అందించిన ఘనత కేసీఆర్‌ది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కోతలు పెరిగాయి. ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు కాలిపోతుండటంతో రైతులు మళ్లీ రోడ్డెక్కాల్సిన దుస్థితి ఎదురైంది. లోయర్ సీలేరు ప్రాజెక్టును మోదీ ప్రభుత్వం చంద్రబాబు కోరిక మేరకు ఏపీకి అప్పగించి తెలంగాణకు అన్యాయం చేసింది. సింగరేణికి ప్రభుత్వం రూ.60 వేల కోట్లు బకాయి పడింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు రూ.నాలుగున్నర లక్షల కోట్ల అప్పు చేసిన ప్రభుత్వం వాటన్నింటినీ ఏం చేసింది? దిల్లీలోని రాహుల్‌గాంధీకి చెల్లిస్తున్నారు. సింగరేణిలో రెండేళ్లలోనే రూ.6,317 కోట్ల నిధులు పక్కదారి పట్టాయి. కార్మికులకు రావాల్సిన లాభాల వాటాను ప్రభుత్వం ఏటా తగ్గిస్తోంది. ఇటీవల ఆర్టీసీ కార్మిక ఎన్నికల్లో వచ్చిన ఫలితమే సింగరేణి ఎన్నికల్లో పునరావృతం కావాలి. సంస్థను కాపాడుకోవడానికి కేసీఆర్ నాయకత్వం అవసరం" అని కేటీఆర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. సభలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, కౌశిక్‌రెడ్డి, కోవ లక్ష్మి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, కోరుకంటి చందర్, పుట్ట మధు, గండ్ర వెంకటరమణారెడ్డి, రవిశంకర్, దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కేటీఆర్ బుధవారం కొత్తగా కనిపించారు. ఎప్పుడూ క్లీన్ షేవ్‌తో కనిపించే ఆయన గోదావరిఖనిలో నిర్వహించిన కార్మిక గర్జన సభకు గడ్డంతో హాజరయ్యారు. సభలో ఈ విషయాన్ని కేటీఆర్ స్వయంగా ప్రస్తావించారు. కరీంనగర్‌కు రాగానే గంగుల కమలాకర్.. 'ఏందన్నా గడ్డంతో ఉన్నావ్' అని అడిగారు. 'సింగరేణి పురిటి గడ్డ గోదావరిఖని సభకు సాధారణంగా వెళ్తే ఏముంటుంది. అందుకే గడ్డంతో బయలుదేరానని చెప్పా' అని పేర్కొన్నారు.

# విద్యుత్తు అంతరాయాలపై సీఎం ఆగ్రహం



హైదరాబాద్: ఎల్‌నినో నేపథ్యంలో వ్యవసాయ సీజన్‌కు వచ్చే 20 రోజులు అత్యంత కీలకమని, రాష్ట్రంలో పంటలు ఎండిపోకుండా రేయింబవళ్లు విద్యుత్తు సరఫరా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సరఫరాలో అంతరాయాలను సహించేది లేదని, పంటలు చేతికొచ్చే వరకు విద్యుత్తు కోతలు ఉండరాదని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం చేస్తే ఐఏఎస్‌లను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఎల్‌నినో..కొవిడ్ లాంటి విపత్తు అని, దీనిని ఎదుర్కొనేందుకు జూన్ వరకు పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్తు, తాగునీటి సరఫరాపై ఎంసీహెచ్‌ఆర్డీలోని బోధిభవన్‌లో బుధవారం సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిచారు.

**విద్యుత్తు అధికారులపై ఆగ్రహం**

ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయాలపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "విద్యుత్తు సరఫరా సాఫీగా జరిగేలా చూడాలని ఎన్నిసార్లు చెప్పినా పరిస్థితిలో ఎందుకు మార్పు రావడం లేదు?రాబోయే రోజుల్లో విద్యుత్తు కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు లింకేజీ ఏర్పాట్లు చేసినా యాదాద్రి విద్యుత్తు ప్లాంట్‌లో పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి ఎందుకు జరగడం లేదు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సింది నేను. పంటలను కాపాడేందుకు అవసరమైన విద్యుత్తు సరఫరా చేయాలని ఎన్నిసార్లు చెప్పినా పరిస్థితి మారలేదు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలను సహించేది లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోను" అని సీఎం అధికారులను హెచ్చరించారు. వైఫల్యాలపై విద్యుత్తు శాఖ స్పెషల్ సీఎస్, జెన్‌కో సీఎండీ..సంబంధిత విభాగపు ఐఏఎస్‌లను సస్పెండ్ చేస్తానన్నారు. విద్యుత్తు అంతరాయాలకు రోజుకో కారణం చెప్పొద్దన్నారు.ప్రతి మండలానికి ప్రత్యేక పర్యవేక్షణ అధికారులు "ఎల్‌నినో ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ప్రతి మండలానికి గ్రూప్1, గ్రూప్2 స్థాయి అధికారులను నియమించాలి. ఆయా మండలాల్లో వర్షాభావ పరిస్థితులు, విద్యుత్తు, తాగునీటి సరఫరా, పంటలు, పశుగ్రాసం వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించే బాధ్యతలను వారికి అప్పగించాలి. మండలాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)కి నివేదించాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అన్ని వర్గాల ప్రజలకు ఎల్‌నినో విపత్తు తీవ్రతను చెప్పాలి. గ్రామసభలు, కళాజాతలతో అవగాహన కల్పించాలి.



## లీడర్లు దారి చూపిస్తరు.. దేశాన్ని మార్చేది జనమే: ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్

**వెబ్ డెస్క్, అక్టోబర్ 14**

సమాజ సమిష్టి కృషితోనే నిజమైన అభివృద్ధి.. జాతి నిర్మాణంలో ప్రజా భాగస్వామ్యమే కీలకమని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు.. జనాలూ జవాబుదారీగా ఉండాలె! లీడర్లు దిశ చూపిస్తరు.. ప్రభుత్వాలు విధానాలు తెస్తయ్.. కానీ దేశాన్ని గొప్పగా తీర్చిదిద్దేది ప్రజల సమిష్టి కృషినే అని సామాజిక విశ్లేషకులు చెబుతున్నారు. కేవలం రాజకీయ మార్పులతో సమాజం మారదని, ప్రతి పౌరుడు తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించినప్పుడే అసలైన ప్రగతి సాధ్యమని స్పష్టం చేస్తున్నారు. పరిశుభ్రత, క్రమశిక్షణ, ఐక్యత, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎవరి వంతు వారు భాగస్వాములైతేనే దేశం ముందుకు దూసుకుపోతుంది. సర్కారు ఒక్కటే దేశాన్ని మార్చలేదు.. ప్రజలు కదిలితేనే అభివృద్ధికి అసలైన జోష్ వస్తది..

## మన కల్చరే మన గ్లోబల్ పవర్.. ప్రపంచాన్ని కలుపుతున్న భారతీయ కళలు!. మోదీ



వెబ్ డెస్క్, అక్టోబర్ 14:మన దేశం పాట, ఆట, సినిమా, వంటకం.. అన్నీ గ్లోబల్ లెవల్‌లో ఇండియా పేరును మార్మోగిస్తున్నయ్..భారతీయ సంస్కృతి ప్రపంచ దేశాలతో బంధాలను బలోపేతం చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడిన్రు. ఢిల్లీలో అక్టోబర్ 14 నుంచి 16 వరకు జరుగుతున్న 'బృహత్తర భారత్' అంతర్జాతీయ సదస్సుకు పంపిన సందేశంలో ఈ వ్యాఖ్యలు చేసిన్రు. చారిత్రక కట్టడాలతో పాటు 'జ్ఞాన భారతం' కార్యక్రమం ద్వారా పురాతన తాళపత్రాలనూ పరిరక్షిస్తున్నట్లు తెలిపిన్రు. విదేశాల్లో ఉన్న భారతీయ పురాతన కళాఖండాలను తిరిగి తీసుకొచ్చే ప్రయత్నాలకూ ఊపు పెరిగిందన్నారు. ఐజీఎన్‌ఏ నిర్వహిస్తున్న ఈ సదస్సులో వివిధ దేశాల ప్రతినిధులు, రాయబారులు, పండితులు పాల్గొంటున్నారు. మన సంస్కృతి మన గర్వం.. ప్రపంచంతో మన అనుబంధమే అసలైన బలం!



## తెలంగాణలో పెట్టుబడులకు పూర్తి భరోసా

హైదరాబాద్: తెలంగాణలో పెట్టిన పెట్టుబడులు పూర్తి భద్రతతో, సురక్షితంగా ఉంటాయని.. ప్రభుత్వ విధానాల్లో స్థిరత్వం కొనసాగుతోందని యార్క్‌షైర్, యూకే వ్యాపార ప్రతినిధి బృందానికి సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో తయారీరంగాన్ని భారీగా విస్తరించడంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సౌత్‌యార్క్‌షైర్, యార్క్ అండ్ నార్త్‌యార్క్‌షైర్, వెస్ట్ యార్క్‌షైర్ మేయర్లు ఆలివర్ కోపార్డ్, డేవిడ్ స్కేత్, ట్రేసి బ్రాబిన్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి యూకే ప్రతినిధి బృందం బుధవారం ఎంసీహెచ్‌ఆర్‌డీలో సీఎంతో సమావేశమైంది. గతేడాది డిసెంబరులో ప్రారంభించిన రాష్ట్ర దీర్ఘకాలిక అభివృద్ధి రోడ్‌మ్యాప్ 'తెలంగాణ రైజింగ్ 2047' తయారీలో బ్రిటన్ మాజీప్రధాని టోనిబ్లెయిర్ ఒక విజ్ఞాన భాగస్వామిగా కీలకపాత్ర పోషించారని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేశారు. దేశంలోనే అత్యంత పిన్నవయసు గల తెలంగాణ.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్, లైఫ్‌సైన్సెస్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్ తయారీరంగాల్లో ఆధిపత్యం చెలాయిస్తూ అత్యంత చైతన్యవంతమైన రాష్ట్రాల్లో ఒకటిగా ఆవిర్భవించిందన్నారు. 30వేల ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న భారత ఫ్యూచర్‌సిటీ మాస్టర్‌ప్లాన్‌ను త్వరలో ఆవిష్కరిస్తామని చెప్పారు. మూసీ పునరుజ్జీవం ద్వారా హైదరాబాద్‌లో రివర్‌ఫ్రంట్, నైట్ ఎకానమీని అభివృద్ధి చేయాలనుకుంటున్నామని తెలిపారు. వచ్చే డిసెంబరు 7-9 తేదీల్లో భారత ఫ్యూచర్‌సిటీలో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్-2026'కు హాజరు కావాలని ఈ సందర్భంగా యూకే బృందాన్ని సీఎం ఆహ్వానించారు. కార్యక్రమంలో 'యూకే-ఇండియా సెటా అండ్ రీజినల్ సినర్జీస్' పేరుతో యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ రూపొందించిన నివేదికను ఆవిష్కరించారు.

తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ప్రతినిధి బృందం ఆసక్తి

తెలంగాణతో కలిసి అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, వైద్య ఆరోగ్యం, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, ఏరోస్పేస్, టెక్నికల్ టెక్స్‌టైల్స్, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన రంగాల్లో కలిసి పనిచేసేందుకు యూకే బృందం ఆసక్తి వ్యక్తం చేసింది. ఈ రంగాల్లో ఒప్పందాల కోసం మరోసారి తెలంగాణలో పర్యటించాలని భావిస్తున్నట్లు తెలిపారు. సౌత్‌యార్క్‌షైర్ మేయర్ ఆలివర్ కోపార్డ్ మాట్లాడుతూ.. తెలంగాణలోని డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వ్యాపార విస్తరణ అవకాశాలు ఆకట్టుకున్నాయని ప్రశంసించారు. వెస్ట్ యార్క్‌షైర్ మేయర్ ట్రేసిబ్రాబిన్ మాట్లాడుతూ..యార్క్‌షైర్, తెలంగాణ మధ్య అనేక సారూప్యతలున్న నేపథ్యంలో రెండు ప్రాంతాలు సోదరభావంతో కలిసి పనిచేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అంతకుముందు ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు యూకే ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు. జినోమ్‌వ్యాలీ, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను సందర్శించాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ సీఈవో కిశోర్ జయరామన్, హైదరాబాద్ బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సంజయ్‌జాజు, ముఖ్యమంత్రి సలహాదారు కె.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



## ఎప్‌స్టీన్ ఫైల్స్ రిలీజ్ చేయాలంటూ నిరసన..

# ట్రంప్ సభలో దబాయింపు!

**టీషర్ట్‌తో వచ్చిన వ్యక్తిపై దాడి.. 'లావుగా ఉన్నావ్.. బరువు తగ్గు' అంటూ ట్రంప్ సెటైర్లు!**

**వెబ్ డెస్క్, అక్టోబర్ 14**

:అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సభలో ఎప్‌స్టీన్ ఫైల్స్ ముచ్చట రచ్చకెక్కింది.. ఓ ఫైల్ అని రాసున్న టీషర్ట్‌తో నిరసన తెలిపిన ఓ వ్యక్తిపై కొందరు ట్రంప్ మద్దతుదారులు దాడి చేసినట్లు ది సండే గార్డియన్ కథనం తెలిపింది. పిడిగుద్దులు గుద్ది సభ నుంచి బయటకు పంపినట్లు పేర్కొంది. ఈ ఘటనపై ట్రంప్ ఖండించకపోగా, నిరసనకారుడిని ఉద్దేశించి 'లావుగా ఉన్నాడు.. బరువు తగ్గాలి' అంటూ కామెంట్ చేసినట్లు కథనం వెల్లడించింది. నిరసనకారుడికి గాయాలయ్యాయా? ఎవరినైనా అరెస్టు చేశారా? అనే వివరాలు మాత్రం స్పష్టంగా తెలియరాలేదు.

## రైల్వే ఉద్యోగులకు బోనస్ ధమాకా.. పింఛన్లకు కేంద్రం భరోసా!

**వెబ్ డెస్క్, అక్టోబర్ 14**

:పండుగ పూట రైల్వే ఉద్యోగులకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది..ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో 78 రోజుల ప్రొడక్టివిటీ లింక్డ్ బోనస్‌కు ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా 11,40,770 మంది ఉద్యోగులకు ప్రయోజనం కలగనుండగా, ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ.17,951 అందనుంది. ఇందుకోసం రూ.2,009.61 కోట్లు కేటాయించిన్రు. అటు పేదలు, వృద్ధులు, బలహీన వర్గాలకు సామాజిక భద్రత కల్పించే ఎన్‌ఎస్‌ఏపీ పథకాన్ని 2026--27 నుంచి 2030--31 వరకు కొనసాగించేందుకు ఓకే చెప్పిన్రు. ఈ పథకానికి ఐదేళ్లలో రూ.53,428 కోట్లు ఖర్చు చేయనున్నారు. దేశవ్యాప్తంగా సుమారు 3.20 కోట్ల మంది లబ్ధిదారులకు ప్రయోజనం కలగనుంది.



## ఎయిర్‌పోర్టులో సీజేపీ కన్వీనర్‌కు షాక్..

**'దొంగ దొంగ' అంటూ ప్రయాణికుల నినాదాలు!**

జంతర్ మంతర్ ఆందోళనతో అరెస్టులు.. సోషల్ మీడియాలో వీడియో వైరల్!

**వెబ్ డెస్క్, అక్టోబర్ 14:**

కాక్రోచ్ జనతా పార్టీ కు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయట బాస్.. కన్వీనర్ అభిజిత్ దీప్కే ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు చేరుకోగానే కొందరు ప్రయాణికులు 'దొంగ దొంగ' అంటూ నినాదాలు చేసినట్లు సమాచారం. దేశాన్ని ఎందుకు అస్థిరపరచాలని చూస్తున్నారని ఓ ప్రయాణికుడు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అక్టోబర్ 10న జజుజ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో జంతర్ మంతర్ వద్ద నిరసనకు పిలుపునిచ్చిన సందర్భంగా దీప్కేతో పాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసినట్లు కథనం. ఈ ఘటనలపై వస్తున్న వీడియోలు నెట్టింట చర్చకు దారితీస్తున్నాయి.

## బ్లూ డ్రమ్ కేసులో ఉరిశిక్షలు.. మీరట్ కోర్టు సంచలన తీర్పు!

భర్తను చంపి డ్రమ్‌లో సీల్ చేసిన భార్య.. ప్రియుడికీ మరణశిక్ష!

**వెబ్ డెస్క్, అక్టోబర్ 14:**



దేశవ్యాప్తంగా సంచలనం రేపిన బ్లూ డ్రమ్ హత్య కేసులో మీరట్ కోర్టు కీలక తీర్పు ఇచ్చినట్లు సమాచారం బాస్! మర్చంట్ నేవీ ఆఫీసర్ సౌరభ్ రాజ్‌పుత్ హత్య కేసులో భార్య ముస్కాన్, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లాకు ఉరిశిక్ష విధించినట్లు కథనం. 2025 మార్చి 4న లండన్ నుంచి వచ్చిన సౌరభ్‌కు ఆహారంలో నిద్రమాత్రలు ఇచ్చి, అనంతరం హత్య చేసి మృతదేహాన్ని ముక్కలుగా చేసి బ్లూ డ్రమ్‌లో పెట్టి సిమెంట్‌తో సీల్ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

## హైదరాబాద్‌లో ఇండీ కూటమి

# దమ్ము చూపిస్తదా?

ఈ నెల 24న భారీ సభకు ప్లాన్..లక్ష మంది జనసమీకరణపై కాంగ్రెస్ ఫోకస్!

**హైదరాబాద్, అక్టోబర్ 14:**



హైదరాబాద్ వేదికగా జాతీయ రాజకీయాల్లో సత్తా చాటేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం రెడీ అవుతోందట.. ఈ నెల 24న ఇండీ కూటమి ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. సుమారు లక్ష మందిని సమీకరించేలా టీపీసీసీ నేతలు కసరత్తు చేస్తున్నారట. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు కూటమి అగ్రనేతలు, ముఖ్యమంత్రులు హాజరవుతారని ప్రచారం జరుగుతోంది. సభా వేదిక, ట్రాన్స్‌పోర్ట్, సెక్యూరిటీ ఏర్పాట్లపై నేతలు ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజా సమస్యలే ఎజెండాగా కేంద్ర ప్రభుత్వాన్ని టార్గెట్ చేయడమే సభ లక్ష్యమని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

# జిన్నారం మున్సిపల్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఎర్రవల్లి ప్రవీణ్

**జిన్నారం, అక్టోబర్ 14,(స్పందన):**





జిన్నారం మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా పార్టీ ఎస్సీ సెల్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వడ్డే కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఎర్రవల్లి ప్రవీణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు, పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ సూచనలతో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. నూతన కమిటీ ఉపాధ్యక్షులుగా వై.ఎన్. యాదగిరి, అన్నారం అర్జున్, కొనింటి రాజు, ఊట్ల విరేష్‌లను ఎంపిక చేశారు. జనరల్ సెక్రటరీలుగా దప్పు రమేష్, అన్నారం గణేష్, చంద్రయ్య, కొనింటి టిల్లు, ఇదిగారి రాజులను నియమించారు. కమిటీ సభ్యులుగా గోపాల్, తోట సంజీవ, తోట అశోక్, బ్యాగరీ అశోక్, బిక్షపతి, శ్రావణ్, ప్రవీణ్, రవి, ప్రసాద్, సంజీవ, భాజలాలు, చందు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, నూతన కమిటీ నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు ఎస్సీ వర్గాల సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ గంగు రమేష్, నూతన కమిటీ ఎన్నికల ఇన్‌చార్జి శ్రీకాంత్, కాంగ్రెస్ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఇంటింటికీ తాగునీరు అందించేందుకు మడిగి సర్పంచ్ కృషి...

**ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యం.. సర్పంచ్ హర్షద్ జామా పటేల్ చొరవ...**

**జహీరాబాద్ అక్టోబర్ 14(స్పందన)**

జహీరాబాద్ నియోజకవర్గం మొగుడంపల్లి మండలం మడిగి గ్రామంలో ఇంటింటికీ తాగునీరు అందించేందుకు గ్రామ సర్పంచ్ హర్షద్ జామా పటేల్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గ్రామంలోని బోరు నుంచి నేరుగా నీటి కనెక్షన్ ఏర్పాటు చేసి ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా కృషి చేశారు. గ్రామ ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా సర్పంచ్ తీసుకున్న చర్యలపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాలను గుర్తించి తాగునీటి సమస్య పరిష్కారానికి ముందడుగు వేయడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# దసరా సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేస్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త!

## దొంగతనాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి

## ఐడీఏ బొల్లారం సీఐ సుధీర్ కుమార్ సూచనలు

**జిన్నారం, అక్టోబర్ 14,(స్పందన):**



దసరా సెలవుల్లో సొంతూళ్లకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారా? అయితే ఇంటికి తాళం వేసి వెళ్లే ముందు అప్రమత్తంగా ఉండాలని ఐడీఏ బొల్లారం సీఐ సుధీర్ కుమార్ సూచించారు. పండుగ సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే వారు దొంగతనాల బారిన పడకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని కోరారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఇంట్లో బంగారం, నగదును ఉంచకుండా సురక్షితంగా భద్రపరచుకోవాలని, తలుపులు, కిటికీలకు దృఢమైన తాళాలు వేయాలని సూచించారు. నమ్మకమైన పొరుగువారికి, సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం ఇచ్చి ఇంటిని గమనించేలా చూడాలన్నారు. సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చూసుకోవడంతో పాటు, రాత్రివేళ ఇంటి బయట తగినంత వెలుతురు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. తాము ఊరికి వెళ్తున్నట్లు ప్రయాణ వివరాలను సోషల్ మీడియాలో పోస్టు చేయవద్దని, ఇంటి తాళాలను బయట దాచవద్దని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపిస్తే వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని సీఐ సుధీర్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# జిన్నారం వనదుర్గా ఆలయంలో వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

**- మహాచండి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు**

**జిన్నారం, అక్టోబర్ 14,(స్పందన):**



జిన్నారం వనదుర్గా ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు అమ్మవారు మహాచండి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

# పోతులబోగుడలో ఘనంగా నవరాత్రులు

## ప్రత్యేక పూజలో పాల్గొన్న సర్పంచ్ రాజు, మాజీ సర్పంచ్ సంగన్న

**వట్పల్లి, అక్టోబర్ 14 (స్పందన)**



వట్పల్లి మండల పరిధిలోని పోతులబోగుడా గ్రామంలో విజయదశమి నవరాత్రుల సందర్భంగా ఆదివారం దుర్గామాత విగ్రహానికి బసవేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజలు అమ్మవారి ఆశీస్సులు పొందారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు భక్తిపారవశ్యంతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**భక్తి, ఐక్యతకు ప్రతీకగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు**

దుర్గామాత అనుగ్రహంతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని భక్తులు ఆకాంక్షించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామ ప్రజల్లో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు మన సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముద్దాపురం రాజు, కోసికె ప్రభాకర్, జంబిగే సంగమేశ్వర, కోసికె శేఖర్, బీపీ శేఖర్, బీపీ రాజశేఖర్, పట్లోల్ల భాను, బంగ్లా నర్సింలు, గురు నర్సింలు, ఆనంద్, చైతన్య తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు అమ్మవారి పూజల్లో పాల్గొని కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో విజయవంతం చేశారు.

# అయ్యప్ప ఆలయ నిర్మాణ పనుల్లో జాప్యమెందుకు?

**- పనుల వేగం పెంచాలని అరుణ్ గురుస్వామి సూచన**

**జిన్నారం, అక్టోబర్ 14,(స్పందన):**





గడ్డపోతారం మున్సిపల్ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యంపై మాన్యశ్రీ అరుణ్ గురుస్వామి ఆరా తీశారు. బుధవారం ఆలయ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, ఇప్పటివరకు పనులు ఎంతవరకు పూర్తయ్యాయి, జాప్యానికి కారణాలేమిటని ఆలయ కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శబరిమల అయ్యప్ప సేవా సమాజం ప్రధాన కార్యదర్శి శివశంకర్, ఆలయ కమిటీ చైర్మన్ బాలు శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదోళ్ల సొంతింటి కలకు ఇందిరమ్మ టవర్స్.. పోచారంలో పనులు షురూ!

**రూ.43 కోట్లతో 480 మందికి ఫ్లాట్లు.. సెలక్షన్‌లో ఫుల్ పారదర్శకత అంటున్న మంత్రి!**

**, అక్టోబర్ 14**

:పేదోళ్ల సొంతింటి కల నిజం చేయడమే కాంగ్రెస్ సర్కారు టార్గెట్ అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పిన్రు బాస్! ఘట్కేసర్ సర్కిల్ పోచారం డివిజన్‌లో రూ.43 కోట్లతో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్‌కు బుధవారం శంకుస్థాపన చేసిన్రు. మొత్తం 480 మంది లబ్ధిదారులకు ఫ్లాట్లు కేటాయించనున్నట్టు తెలిపిన్రు. అప్లికేషన్ల వెరిఫికేషన్ తర్వాత పారదర్శకంగా సెలక్షన్ ఉంటుందని, స్థానికులకే ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేసిన్రు. రెండు మూడు విడతల్లో లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని, కొత్తగా అప్లై చేసుకునే వాళ్లకూ ఛాన్స్ ఉంటుందని చెప్పిన్రు. రిజిస్ట్రేషన్ కూడా ఫ్రీగా చేస్తామని, డాక్యుమెంట్లతో బ్యాంక్ లోన్ తీసుకునే అవకాశం ఉంటుందని వెల్లడించిన్రు.



# ఓటర్ల లిస్టుపై ఒవైసీ పంజా.. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలా!

**వెబ్ డెస్క్, అక్టోబర్ 14:**

ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ సుప్రీంకోర్టు మెట్లు ఎక్కిన్రు.. దేశవ్యాప్తంగా ఈసీ చేపట్టిన ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను ఛాలెంజ్ చేస్తూ పిటిషన్ వేశారు. సరైన ప్రొసీజర్ పాటించకుండా ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారని ఆయన ఆరోపించిన్రు. ఫారం-6 మ్యాపింగ్ నిబంధనలు ఓటర్లకు భారమవుతున్నాయని చెబుతూ, సర్ పై స్టే ఇవ్వాలని కోరిన్రు. ఒవైసీ తరఫున అడ్వకేట్ నిజాముద్దీన్ పాషా వాదనలు వినిపించిన్రు. ఇప్పటికే రాహుల్ గాంధీ సహా పలువురు ప్రతిపక్ష నేతలు కూడా ఈ అంశంపై పిటిషన్లు దాఖలు చేసిన్రు. సంబంధిత పిటిషన్లతో కలిపి విచారణ చేపట్టే అంశాన్ని పరిశీలిస్తామని సీజేఐ తెలిపినట్లు సమాచారం.





# గజ్వేల్‌కు మళ్లీ వస్తా బాస్.. డే మొత్తం మీతోనే ఉంటా!

## కేటీఆర్ భరోసాతో గులాబీ క్యాడర్‌లో జోష్..

వెబ్ డెస్క్, అక్టోబర్ 14:

గజ్వేల్ గులాబీ దళానికి కేటీఆర్ గట్టి భరోసా ఇచ్చిన్రు బాస్! సింగరేణి కార్మిక గర్జన సభకు పోతూ రిమ్మనగూడ ఎస్-4 దగ్గర బీఆర్ఎస్ లీడర్లు, కార్యకర్తలను కలిసిన్రు. వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో క్యాడర్ భారీగా తరలొచ్చి ఘన స్వాగతం పలికింది. ఈ సందర్భంగా కేటీఆర్ ఆప్యాయంగా పలకరిస్తూ.. "మళ్లీ గజ్వేల్‌కు వస్తా.. ఒక రోజంతా మీతోనే ఉంటా" అని మాటిచ్చిన్రు. దీంతో గులాబీ శ్రేణుల్లో ఫుల్ జోష్ నెలకొన్నది. అనంతరం భారీ కాన్వాయ్‌తో గోదావరిఖనిలోని సింగరేణి సభకు బయలుదేరిన్రు.

స్పందన
తెలుగు దినపత్రిక



# చెరువు శిఖం భూమికి కబ్జా కోరలు...!

**-భారీ నిర్మాణాలు జరుగుతున్నా అధికార యంత్రాంగం ఏమి చేస్తోంది?**

**-ఇరిగేషన్.. రెవెన్యూ.. మున్సిపల్ శాఖల పర్యవేక్షణ ఎక్కడ?**

**-చెరువుల పరిరక్షణకు చట్టాలు ఉన్నా క్షేత్రస్థాయిలో అమలు ఏదీ?**








**పటాన్‌చెరు, అక్టోబర్ 14, (స్పందన):**

ప్రజల నీటి అవసరాలకు, భూగర్భ జలాల పెరుగుదలకు, వర్షపు నీటి నిల్వకు కీలకమైన చెరువుల భూములకే రక్షణ కరువవుతోందా? చెరువు శిఖం భూముల్లో నిర్మాణాలు చేపట్టకుండా అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం ఏం చేస్తోంది? అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్న సమయంలో సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహిస్తున్నారా? లేక నిర్మాణాలు పూర్తయ్యే వరకు వేచి చూసే ధోరణిలో ఉన్నారా? ఇస్నాపూర్ పురపాలక సంఘం పరిధిలోని చెరువు శిఖం కుంట వద్ద కనిపిస్తున్న నిర్మాణ పనులు ఇప్పుడు ఇలాంటి కీలక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. భారీ స్థాయిలో నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు కనిపిస్తున్నాయి. కాంక్రీట్ పిల్లర్లు, ఇనుప చువ్వలు, నిర్మాణానికి సంబంధించిన ఇతర భాగాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇంత పెద్ద స్థాయిలో పనులు జరుగుతున్న ప్రదేశం చెరువు శిఖం భూమిలోకి వస్తుందా? సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు తీసుకున్నారా? భూమి హక్కులకు సంబంధించిన రికార్డులు ఏమి చెబుతున్నాయి? చెరువు సరిహద్దులు అధికారికంగా నిర్ధారించబడ్డాయా? ఈ ప్రశ్నలకు సంబంధిత అధికారులు ప్రజలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**చెరువు భూముల్లో నిర్మాణాలా.. అధికారుల పర్యవేక్షణ ఏమైంది?**

ఒక సాధారణ నివాస నిర్మాణమైనా, వాణిజ్య భవనమైనా, భారీ నిర్మాణమైనా సంబంధిత భూమి స్వభావం, యాజమాన్య హక్కులు, వర్తించే చట్టాలు, అవసరమైన అనుమతులు పరిశీలించడం అత్యంత కీలకం. ముఖ్యంగా చెరువులు, కుంటలు, వాటి శిఖం భూములు, నీటి నిల్వ ప్రాంతాలు, నీటి ప్రవాహ మార్గాల విషయంలో మరింత జాగ్రత్త అవసరం.చెరువు శిఖం భూమి అని అధికారిక రికార్డుల్లో నమోదై ఉంటే, అక్కడ నిర్మాణం చేపట్టడానికి సంబంధించి వర్తించే చట్టాలు, నిబంధనలు ఏమి చెబుతున్నాయో పరిశీలించకుండా ముందుకు వెళ్లడం సరికాదు. నీటి వనరుల పరిరక్షణకు సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత అధికారులు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. ఇస్నాపూర్ పరిధిలోని ఈ నిర్మాణ స్థలం చెరువు శిఖం భూమిలోకి ఉంటుంది. అందుకు సర్వే నంబర్లు, రెవెన్యూ రికార్డులు, చెరువు ఎఫ్‌టీఎల్ (పూర్తి నీటి మట్టం) నిర్ధారణ పత్రాలు, శిఖం భూమి వివరాలు, ఇరిగేషన్ శాఖ రికార్డులు, అవసరమైన అనుమతులను పరిశీలించాలి. ప్రజల ముందున్న ప్రధాన ప్రశ్న మాత్రం స్పష్టంగా ఉంది. ఇంత భారీ నిర్మాణం జరుగుతున్న ప్రదేశంపై ఇప్పటివరకు సంబంధిత శాఖలు తనిఖీలు నిర్వహించాయా? నిర్వహిస్తే ఏం గుర్తించారు? ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ఎలాంటి ఉల్లంఘనలు లేవని చెబితే దానికి ఆధారమైన అధికారిక పత్రాలు ఏమిటి? ఈ వివరాలను బయటపెట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

**ఇరిగేషన్ శాఖ స్పందించాల్సిందే...!**

చెరువులు, కుంటలు, నీటి నిల్వ ప్రాంతాల పరిరక్షణలో ఇరిగేషన్ శాఖకు కీలక బాధ్యతలు ఉంటాయి. సంబంధిత చెరువు పరిధి, శిఖం భూమి, నీటి నిల్వ సామర్థ్యం, నీటి ప్రవాహ మార్గాలు, వర్తించే పరిరక్షణ నిబంధనల ఆధారంగా అధికారులు తమ పరిధిలో చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.ఇస్నాపూర్ పరిధిలోని చెరువు శిఖం కుంటకు సంబంధించి ఇరిగేషన్ శాఖ వద్ద ఉన్న రికార్డులు ఏమి చెబుతున్నాయి? చెరువు సరిహద్దులను అధికారికంగా గుర్తించారా? నిర్మాణం జరుగుతున్న స్థలాన్ని సర్వే చేశారా? సర్వే నిర్వహించి ఉంటే దాని నివేదిక ఎక్కడ ఉంది? నిర్మాణం చెరువు భూమిలోకి వస్తున్నట్లు తేలితే సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశారా? ఎలాంటి ఉల్లంఘనలు లేవని భావిస్తే దానికి ఆధారాలు ఏమిటి.ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. నీటి వనరుల పరిరక్షణ అనేది కేవలం రికార్డుల్లో ఉండాల్సిన అంశం కాదు. క్షేత్రస్థాయిలో వాటిని కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి.ప్రజలకు ఉపయోగపడాల్సిన చెరువుల విషయంలో నిర్లక్ష్యం జరిగిందనే అనుమానం వచ్చినప్పుడు అధికారులు మౌనం వహించకుండా వాస్తవాలను వెల్లడించాలి. ఫిర్యాదు అందిన తర్వాతే స్పందిస్తామనే ధోరణి కాకుండా, తమ పరిధిలోని నీటి వనరుల పరిస్థితిని పర్యవేక్షించే వ్యవస్థ ఎలా పనిచేస్తోందో వివరించాలి.

**రెవెన్యూ శాఖ రికార్డులు ఏమంటున్నాయి?**

భూమి స్వభావం, సర్వే నంబరు, పట్టాదారు వివరాలు, ప్రభుత్వ భూమి స్థితి, చెరువు శిఖం భూమి వివరాలు వంటి అంశాలను నిర్ధారించడంలో రెవెన్యూ రికార్డులకు ప్రాధాన్యం ఉంటుంది. నిర్మాణం జరుగుతున్న స్థలం అసలు ఏ వర్గానికి చెందిన భూమి? అది ప్రైవేటు భూమా? ప్రభుత్వ భూమా? చెరువు శిఖం భూమిగా నమోదైందా? నీటి వనరులకు సంబంధించిన ఇతర పరిమితులు ఉన్నాయా? అన్నది అధికారికంగా పరిశీలించాల్సిందే.స్థలానికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు, గ్రామ పటం, ఎఫ్ఎంబీ (ఫీల్డ్ మెజర్‌మెంట్ బుక్), అందుబాటులో ఉన్న చెరువు రికార్డులు, సంబంధిత సర్వే నివేదికలను సమన్వయంతో పరిశీలించాలి. అవసరమైతే సంబంధిత శాఖల అధికారులతో సంయుక్త సర్వే నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందుంచాలి.ఒకవేళ నిర్మాణ స్థలం చెరువు శిఖం భూమిలోకి వస్తున్నట్లు నిర్ధారణ అయితే, వర్తించే చట్టాల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలి.మరోవైపు నిర్మాణం నిబంధనలకు అనుగుణంగానే ఉందని అధికారులు చెబితే, ఆ నిర్ణయానికి ఆధారమైన రికార్డులను స్పష్టంగా వెల్లడించాలి.భూమి స్వభావంపై సందేహాలు ఉన్నప్పుడు వాటిని నివృత్తి చేయాల్సింది అధికారులే. ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత. రికార్డులు పరిశీలించకుండా ఎవరినీ తప్పుబట్టడం ఎంతవరకు సరికాదో, రికార్డులు పరిశీలించకుండా నిర్మాణాలపై ఎలాంటి సమస్య లేదని చెప్పడం కూడా అంతే సరికాదు.

**మున్సిపల్ అధికారుల బాధ్యత ఎక్కడ?**

ఇస్నాపూర్ పురపాలక సంఘం పరిధిలో నిర్మాణం జరుగుతున్నట్లయితే, ఆ స్థలానికి సంబంధించి పురపాలక సంఘానికి వర్తించే భవన నిర్మాణ నిబంధనలు,అనుమతులు, లేఅవుట్ వివరాలు, సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతుల అంశాలను పరిశీలించాలి.నిర్మాణానికి అనుమతి మంజూరు చేశారా? చేస్తే ఏ పత్రాల ఆధారంగా ఇచ్చారు? నిర్మాణ అనుమతి నంబరు ఏమిటి? ఆ అనుమతి ఏ రకమైన నిర్మాణానికి వర్తిస్తుంది? స్థలానికి సంబంధించి చెరువు పరిరక్షణ పరిమితులు ఉన్నాయా? అవసరమైన శాఖల నుంచి నిరభ్యంతర పత్రాలు లేదా ఇతర అనుమతులు అవసరమైతే అవి సమర్పించారా? నిర్మాణం ఆమోదించిన ప్లాన్ ప్రకారమే జరుగుతోందా? ఇవన్నీ మున్సిపల్ అధికారులు రికార్డుల ఆధారంగా స్పష్టం చేయాల్సిన ప్రశ్నలు.నిర్మాణ అనుమతి మంజూరైందనే కారణంతోనే ప్రతి నిర్మాణం అన్ని చట్టాలకు అనుగుణంగా ఉందని భావించలేం. అనుమతి పత్రాలు, స్థల రికార్డులు, చెరువు సరిహద్దులు, వర్తించే పరిమితులు అన్నింటినీ కలిపి పరిశీలించినప్పుడే వాస్తవాలు బయటపడతాయి.నిర్మాణ అనుమతులు పరిశీలించడం, ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవడం, ఇతర శాఖల పరిధిలోని అంశాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం వంటి బాధ్యతలను మున్సిపల్ యంత్రాంగం సమర్థంగా నిర్వహించాలి.

**చెరువులు కనుమరుగైతే నష్టపోయేది ప్రజలే!**

చెరువులు కేవలం నీరు నిల్వ ఉండే ప్రదేశాలు మాత్రమే కావు. వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భ జలాల పెరుగుదలకు తోడ్పడడం, స్థానిక పర్యావరణ సమతుల్యతను కాపాడడం వంటి అనేక ప్రయోజనాలు వాటికి ఉన్నాయి.నీటి నిల్వ ప్రాంతాలు క్రమంగా కుంచించుకుపోతే, నీటి ప్రవాహ మార్గాలకు అడ్డంకులు ఏర్పడితే, వర్షపు నీరు సహజంగా చేరే ప్రాంతాల్లో మార్పులు చోటుచేసుకుంటే దాని ప్రభావం పరిసర ప్రాంతాలపై పడే అవకాశం ఉంది. నీటి నిల్వ సామర్థ్యం తగ్గడం, వర్షపు నీటి పారుదల సమస్యలు, భూగర్భ జలాలపై ప్రతికూల ప్రభావాలు వంటి అంశాలు తలెత్తవచ్చు. చెరువుల పరిరక్షణను తేలికగా తీసుకోకూడదు. ఒకసారి నీటి వనరు దెబ్బతిన్న తర్వాత దాన్ని పునరుద్ధరించడం కష్టసాధ్యమవుతుంది. అభివృద్ధి అవసరమే అయినా, అది చట్టబద్ధంగా, పర్యావరణ ప్రయోజనాలను కాపాడుతూ జరగాలి.ఇస్నాపూర్ పరిధిలోని ఈ నిర్మాణం విషయంలో కూడా ముందుగా వాస్తవాలను నిర్ధారించాలి. నిర్మాణం చెరువు శిఖం భూమిలోకి వస్తే, దాని ప్రభావం ఏమిటి? నీటి నిల్వకు లేదా ప్రవాహానికి అడ్డంకి ఏర్పడుతోందా? సంబంధిత అధికారులు ఏ చర్యలు తీసుకోవాలి? ఈ అంశాలపై సాంకేతికంగా పరిశీలించి ప్రజలకు వివరించాలి.ప్రజల ఆస్తులకే కాదు, ప్రజలకు చెందిన సహజ వనరుల పరిరక్షణకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**భారీ నిర్మాణం కనిపిస్తున్నా తనిఖీలు జరిగాయా?**

నిర్మాణ అనుమతులు, భూమి స్వభావం, చెరువు సరిహద్దుల నిర్ధారణ, సంబంధిత శాఖల పర్యవేక్షణపై సమగ్ర విచారణ జరగాలనే డిమాండ్ ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

అధికారులు ఇప్పటికే తనిఖీలు నిర్వహించి ఉంటే, వాటి వివరాలను వెల్లడించాలి. నిర్మాణంపై ఫిర్యాదులు అందాయా? అందితే వాటిపై తీసుకున్న చర్యలు ఏమిటి? తనిఖీల్లో ఎలాంటి ఉల్లంఘనలు గుర్తించారు? నిర్మాణానికి సంబంధించిన పత్రాలను పరిశీలించారా? ఏదైనా శాఖ నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయా? అన్నది స్పష్టం చేయాలి.ఇప్పటివరకు ఎలాంటి తనిఖీలు జరగకపోతే, ఈ అంశాన్ని సంబంధిత ఉన్నతాధికారులు గమనించి తక్షణమే పరిశీలనకు ఆదేశించాలి.ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలి. నిర్మాణ స్థలం చెరువు శిఖం భూమిలోకి వస్తుందనే అనుమానం ఉంటే దానిని నిర్లక్ష్యం చేయకుండా అధికారికంగా తేల్చాల్సిన అవసరం ఉంది. బాధ్యతాయుతమైన పాలన అంటే ఇదే.

**ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులదే!**

ప్రజల నుంచి పన్నులు వసూలు చేసే ప్రభుత్వ వ్యవస్థ, ప్రజలకు చెందిన సహజ వనరులను కాపాడటంలోనూ బాధ్యతగా వ్యవహరించాలి. ఏదైనా నిర్మాణంపై అనుమానాలు వ్యక్తమైనప్పుడు, దానిని రాజకీయ, వ్యక్తిగత లేదా ఇతర కోణాల్లోకి మళ్లించకుండా చట్టపరమైన రికార్డుల ఆధారంగా విచారించాలి.ఇస్నాపూర్ పురపాలక సంఘం కమిషనర్, సంబంధిత రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ శాఖ అధికారులు ఈ అంశంపై సమన్వయంతో పరిశీలన చేపట్టాలి. అవసరమైతే సంయుక్త సర్వే నిర్వహించి నిర్మాణ స్థలానికి సంబంధించిన వాస్తవాలను నిర్ధారించాలి.నిర్మాణం చట్టబద్ధంగా ఉంటే ఆ విషయాన్ని ఆధారాలతో ప్రజలకు తెలియజేయాలి. నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై వర్తించే చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలి. తప్పు చేసినవారు ఎవరైనా సరే చట్టం ముందు సమానమే అనే సూత్రం అమలులో కనిపించాలి.అధికారుల స్పందన కోసం ప్రజలు ఎన్నిసార్లు తిరగాలి? ఒక నిర్మాణం చట్టబద్ధతను నిర్ధారించడానికి ఎంత సమయం పడుతుంది? ఫిర్యాదులు వచ్చినప్పుడు వాటి పరిష్కారానికి నిర్దిష్ట వ్యవస్థ ఉందా? అనే ప్రశ్నలకు కూడా సమాధానాలు అవసరం.

**ఉన్నతాధికారులు స్పందించాలి.. సమగ్ర విచారణ చేపట్టాలి!**

ఈ అంశాన్ని జిల్లా స్థాయి ఉన్నతాధికారులు కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది. సంబంధిత శాఖల నుంచి నివేదికలు తెప్పించి, నిర్మాణ స్థలం స్వభావం, అనుమతులు, చెరువు సరిహద్దులు, శిఖం భూమి వివరాలు, అవసరమైన అనుమతులు, క్షేత్రస్థాయి తనిఖీల వివరాలను పరిశీలించాలి.అవసరమైతే సంయుక్త బృందాన్ని ఏర్పాటు చేసి స్థల పరిశీలన నిర్వహించాలి. నిర్మాణం చెరువు పరిరక్షణ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు ప్రాథమిక ఆధారాలు లభిస్తే, చట్టప్రకారం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోవాలి. విచారణ పూర్తయ్యే వరకు ఏ చర్యలు తీసుకోవచ్చనే విషయాన్ని కూడా సంబంధిత చట్టాలు, అధికార పరిధి ఆధారంగా నిర్ణయించాలని ప్రజలు కోరుతున్నారు.

# దాండియా వేడుకల్లో మహిళల జోరు..

**పీవీఆర్ గార్డెన్‌లో సందడే సందడి మెగా దాండియా నిర్వహణ అద్భుతం... మాస్టర్స్ వినోద్, పూల్ సింగ్‌లకు రాథోడ్ సుభాష్ అభినందనలు..**

**జహీరాబాద్ అక్టోబర్14 (స్పందన)**





దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని పీవీఆర్ గార్డెన్‌లో రాక్ డ్యాన్స్ స్టూడియో ఈ వెంట్స్ టీమ్ ఆధ్వర్యంలో బుధవారం నాడు నిర్వహించిన మెగా దాండియా కార్యక్రమం ఘన విజయం సాధించింది. ఈ వేడుకల్లో మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా దాండియా నృత్యాలు చేస్తూ సందడి చేశారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మహిళా సోదరీ మణులందరికీ నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాథోడ్ సుభాష్ మాట్లాడుతూ.. రాక్ డ్యాన్స్ స్టూడియో ఈవెంట్స్ టీమ్ ఆధ్వర్యంలో మెగా దాండియా కార్యక్రమాన్ని ఎంతో అద్భుతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేసిన డ్యాన్స్ మాస్టర్స్ వినోద్, పూల్ సింగ్‌లను ప్రత్యేకంగా అభినందించారు. మహిళలు, యువతులకు ఆహ్లాదాన్ని అందించడంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రముఖ సంఘ సేవకులు బండి సుధాకర్ మాట్లాడుతూ మెగా దాండియా కార్యక్రమానికి మహిళా సోదరీ మణుల నుంచి లభించిన సహకారం, ఆదరణ ఎంతో సంతోషాన్ని కలిగించాయన్నారు. వారి ప్రోత్సాహంతో రానున్న రోజుల్లో మరిన్ని గొప్ప కార్యక్రమాలను నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సమాజంలో ఐక్యత, సాంస్కృతిక చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి వేడుకలు దోహద పడతాయని పేర్కొన్నారు. ఈ మెగా దాండియా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వెంకటేశ్వర షాపింగ్ మాల్ అధినేత నీల వెంకటేశం గుప్తా, ఎస్‌ఐ వినయ్ కుమార్, పీవీఆర్ గార్డెన్ అధినేత పురుషోత్తం రెడ్డి, డాక్టర్ సీతారామరాజు,నారాయణ,డాక్టర్ రాజ్ కుమార్ ఎండీ ప్రముఖ సంఘ సేవకులు బండి సుధాకర్ తదితరులు హాజరయ్యారు. వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, మహిళా ప్రతినిధులు, డ్యాన్స్ మాస్టర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మొత్తంగా రాక్ డ్యాన్స్ స్టూడియో ఈవెంట్స్ టీమ్ నిర్వహించిన మెగా దాండియా వేడుకలు మహిళలు, యువతుల్లో ఉత్సాహాన్ని నింపడంతో పాటు పట్టణంలో పండుగ వాతావరణాన్ని మరింత సందడిగా మార్చాయి. కార్యక్రమం విజయవంతం కావడంతో నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేస్తూ సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

# పారిశుధ్య కార్మికులకు సన్మానం

**- ముత్తంగి డివిజన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముత్తంగి గ్రామంలో పారిశుధ్య కార్మికులకు ఘన సన్మానం, చీరలు, గొడుగుల పంపిణీ**

**పటాన్ చెరు, అక్టోబర్ 14, (స్పందన):**





జిహెచ్ఎంసి పారిశుధ్య కార్మికులను కాంగ్రెస్ పార్టీ నాయకుడు షాపూరం నరసింహారెడ్డి సన్మానించి, ఉచితంగా చీరలు, గొడుగులను అందజేశారు. ముత్తంగి వార్డు కార్యాలయంలో గురువారం ముత్తంగి డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, గ్రామ పరిశుభ్రత సమాజ సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి, కార్మికులను సన్మానం చేయడం జరిగిందని తెలిపారు. కార్మికుల సంక్షేమం, గౌరవం కోసం ఎల్లప్పుడూ తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ముత్తంగి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువజన నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

Printed, Published, Owned by Md Nazeer Ahmed, Published from 5-8-124/231, Narayana Reddy colony, Sangareddy, Telangana 502001 Printed At Saketh Printers SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001,RNI NO TGTEL26/A6780